ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07.09.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు గణేశ్ చతుర్థి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఖైరతాబాద్ మహాగణపతి తొలిపూజలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

2. వరద బాధితులకు అందించాల్సిన సహాయ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎల్లుండి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తారు.

3. రాష్ట్రంలో వరదనష్టం సుమారు 5 వేల 438 కోట్ల రూపాయలు ఉంటుందని ప్రాథమిక అంచనాను, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

4. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీ కార్యకర్తలను సిద్ధం చేస్తానని , టీపీసీసీ నూతన అధ్యక్షుడు , ఎమ్మెల్సీ మహేశ్కుమార్ గౌడ్ తెలిపారు.

**GANESH CHATHURDI**

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు గణేశ్ చతుర్థి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈరోజు నుంచి పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రజలు తమ ఇళ్లల్లో, వీధుల్లో వినాయక విగ్రహాలకు పూజలు చేస్తారు. ఈ ఉత్సవాలు వినాయక విగ్రహాల నిమజ్జనంతో ముగుస్తాయి. వినాయకచవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని ఖైరతాబాద్ మహా గణపతికి ఈ ఉధయం జరిగిన తొలిపూజలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షి ముఖ్యమంత్రితో కలిసి ఖైరతబాద్ గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు గత 70 ఏళ్లుగా దేశం దృష్టిని ఆకర్షించే విధంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. భక్తులను దృష్టిలో ఉంచుకుని, గణేశ్ మండపాలకి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. ఇక , సాయంత్రం ఖైరతబాద్ గణేశ్ కి నిర్వహించే ప్రత్యేక పూజల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారు.

కాగా, ఖైరతాబాద్‌లో గణేశ్ వేడుకలను ప్రారంభించి 70 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యలో ఈసారి 70 అడుగుల ఎత్తులో వినాయకుడి విగ్రహాన్ని సిద్ధం చేశారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు.. రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో ఇక్కడి విఘ్నేశ్వరుడిని సిద్ధం చేశారు. మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా

ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, నెక్లస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఈరోజు నుంచి ఈనెల 17 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్ విశ్వ ప్రసాద్ తెలిపారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో చేసిన ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా ప్రజలకు శుభకాంక్షలు తెలియజేశారు.

సంగారెడ్డిలో ఆ జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రశేఖర్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజలంతా పర్యావరణానికి హితం కలిగించే మట్టి గణనాథులనే పూజించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలకు సూచించారు.

PTC-HYD, KARIMNAGAR, JAGITYAL, SANGAREDDY, WGL

**పంట నష్ట పరిహారం**

భారీ వర్షాలు , వరదలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది. కనీసం 33 శాతం పంట నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. వ్యవసాయ అధికారులు ఈ నెల 12 లోగా క్షేత్రస్థాయిలో పర్యటించి , కలెక్టర్లకు వివరాలు అందజేయాలని ఆదేశించింది. కాగా , రాష్ట్రంలో 29 జిల్లాలను ప్రభుత్వం వరద బాధిత జిల్లాలుగా ప్రకటించింది. సిరిసిల్లా, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మినహా అన్ని జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. వర్షాలతో ఏర్పడ్డ నష్టాలు , చేపట్టాల్సిన పునరావాస కార్యక్రమాలు, అందించాల్సిన సహాయం , పునర్నిర్మాణ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎల్లుండి ఉన్నతస్థాయి సమావేశం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ సందర్భంగా తెలియజేశారు.

DESK

**CM-CENTRAL MINISTER**

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో అపార నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కి వివరించారు. రాష్ట్రంలో వరద నష్టం దాదాపు 5 వేల 438 కోట్ల రూపాయలు ఉంటుందని ప్రాథమిక అంచనాను కేంద్రమంత్రికి తెలియజేశారు. పూర్తి అంచనాల తర్వాత ఈ నష్టం మరింత పెరిగే అవకాశముందని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రులు

శివరాజ్ సింగ్ చౌహన్, బండి సంజయ్ కుమార్ తో సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సాయంత్రం సమావేశమయ్యారు.

DESK

**CM-CORPORATION**

వరద బాధితులను ఆదుకోవడానికి రాష్ట్రంలోని వివిధ కార్పోరేషన్లు ముందుకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి 2 కోట్ల రూపాయల విరాళం అందించిన తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఆ కార్పోరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, నిన్న సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి చెక్కును అందించారు.

PN

**FLOODS KHAMMAM**

ఖమ్మం మున్నేరు వరదలతో నష్టపోయిన వారు ఆధార్ కార్డు ద్వారా మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ సహాయం కోసం నమోదు చేసుకుంటున్నారు. వరదల వల్ల తమ తెప్పలు , వలలు కొట్టుకుపోయాయని , తమకు వలలు , తెప్పలు అందించాలని పాలేరు ప్రాంత మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా, ఖమ్మం లోని ప్రకాష్ నగర్ బ్రిడ్జిపై పగుళ్ళు రావడంతో ఆరు నెలల పాటు రాకపోకలను నిషేధించి, బ్రిడ్జికి ఇరువైపులా గోడ నిర్మించారు.

PTC, KMM

**WEATHER UPDATE**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు, రేపు ఉరుములు , మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉమ్మడి నిజామాబాద్ , మెదక్ జిల్లాలతో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కాగా, నిన్న రాత్రి కూడా హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది.

PN

**PCC MAHESH GOUD**

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేస్తానని తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్సీ, మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మహేష్ గౌడ్ ఈ ఉదయం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని.. ఇందుకు తన నియామకమే నిదర్శనమని చెప్పారు. త్వరలోనే పార్టీలో పదవుల భర్తీ చేస్తామని , పార్టీలో సీనియర్లు , జూనియర్లు అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. ప్రభుత్వంతో పార్టీని సమన్వయం చేస్తూ పనిచేస్తానని, త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన అన్నారు.

DESK

**SAMPOORNA ABHIYAN**

సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆస్పిరేషనల్ మండలం గుండాలలో ANC రిజిస్ట్రేషన్స్ నమోదు చేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మా ఆకాశవాణి ప్రతినిధి హరికృష్ణతో మాట్లాడుతూ...

(BYTE)

PTC, KOTTAGUDEM

**COMMISSIONS CHAIRMEN**

రాష్ట్ర వ్యవసాయ , రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి ఛైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.కోదండరెడ్డిని నియమించింది. విద్యా కమిషన్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆకునూరి మురళిని నియమించింది. అలాగే బీసీ కమిషన్ ఛైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు , నిరంజన్‌ను నియమిస్తూ , మరో ముగ్గురు సభ్యులతో పాలకమండలిని ఏర్పాటు చేసింది. వ్యవసాయ , విద్యా కమిషన్‌లు ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయగా... బీసీ కమిషన్ ఇప్పటికే ఉంది.

PN

**PUBS-DRUGS**

డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నారనే అనుమానంతో ఎక్సైజ్ అధికారులు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు పబ్బుల్లో నిన్న అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

నిర్వహించారు. జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లిలోని ఐదు పబ్బుల్లో తనిఖీలు చేసి , 33 మందికి డ్రగ్ డిటెక్షన్ టెస్టింగ్ నిర్వహించగా... అందులో నలుగురికి పాజిటివ్ వచ్చిందని ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలియజేశారు.

DESK

**PRAJAVANI**

హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో నిన్న నిర్వహించిన ప్రజావాణికి 570 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడు చిన్నారెడ్డి , ప్రజావాణి నోడల్ అధికారి దివ్య , ఇతర అధికారులు కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీ వెల్ఫేర్ 77, రెవెన్యూ 57, పంచాయతీ రాజ్ 47, విద్యుత్ శాఖ 28, ఇతర శాఖలకు 93 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఈ నెల 10న జరగనున్న ప్రజావాణిని పదకొండో తేదిన నిర్వహిస్తామని , ప్రజలు ఈ మార్పును గమనించాలని నోడల్ అధికారి కోరారు.

PN